


## నెలనెలా సందేహాల సందోహాలు



# ప్రేమ లోకపు సరిహద్దులవతల?

*(చలం గారి 'ప్రేమలేఖలు' గత నెలరోజుల్నించీ నాకాపాదించిన భావావేశం, మీ అందరిలో ఉన్న ప్రేమకు అర్పించే చిరుకానుక, నా ఈ ప్రేమలేఖ. )*

ఎన్నాళ్ళయిందిరా నీకిలా ఉత్తరం రాసి? ఎన్నేళ్ళు అనాలేమో? మళ్ళీ వసంతం వచ్చింది, వస్తూ ఎప్పటిలాగే నీ జ్ఞాపకాలు వెంట తెచ్చింది. రాలే చినుకుల మధ్యలోంచి పలకరించే పువ్వుల సవ్వడుల్లో నీ నవ్వు వినపడుతుంది. కిటికీ బయట మసక వెన్నెట్లో మెరిసే నక్షత్రాల సంకలనంలో నీతో నేను చెప్పని ఊసులెన్నో రూపుదిద్దుకొంటున్నాయి. బహుశా నువ్వు మరో ప్రపంచమవతల ఇలాగే నా గురించి ఆలోచిస్తూ ఉండి ఉంటావేమో అన్న ఆశ తళుక్కున మెరిసి మాయమైపోతుంది. ఇక చేసేదేవుంది? మరో రాత్రంతా మేలుకొని దిగంతాల అవతల సందె పొద్దుల మేఘాలపై పొగమంచు దీపాలు వెలిగించి, నీకు నా ఊపిరి నీరాజనాలర్పిస్తుంటాను.

నీకోసం నేను రాసుకొన్న 'పోస్టు చేయని' ఉత్తరాల కట్ట తీస్తే ఎప్పుడో రాసుకొన్న ఈ పేరా కనపడింది.

'నువ్వు దగ్గరుంటే నాకు ప్రపంచమంతా నాతోనే ఉన్నట్లనిపిస్తుంది. ఇంకేమీ అక్కరలేదనిపిస్తుంది. నువ్వు లేనప్పుడు, మదిలో నీ జ్ఞాపకం మెదిలినప్పుడు నాకో కొత్త ఉత్సాహం వస్తుంది. నువ్వు లేవన్న దిగులు ఉండదు. మరోసారి, మరోచోట, మరెక్కడో మళ్ళీ నిన్ను కలుసుకుంటాననే నమ్మకం మాత్రమే ఉంటుంది. ఆ నమ్మకం నాకు ఆనందాన్నిస్తుంది. నువ్వు నాలో ఒక భాగంగా.. ఉహూ..కాదు.. నువ్వు నాలో భాగానివి కాదు. నువ్వు నేనే. నువ్వంటూ లేనప్పుడు నాకు అర్థం లేదు. కానీ నువ్వు నాకే సొంతం కావాలన్న స్వార్థం లేదు'.

నిజమే, నువ్వు లేవన్న దిగుల్ని మించి మరేదో ఉంటుంది. కానీ నీకు తెలుసా నీ గురించి నేను పడ్డ బాధ? మనసేమో వెళ్ళనీదు. ఇంగితమేమో ఉండనీదు. నీ జ్ఞాపకాల వీధుల్లో దిక్కులు సైతం మరచి తిరుగాడిన ఒంటరి క్షణాలెన్నో. నీ చుట్టూ నేనల్లుకొన్న వలపుల ఇంద్రధనసులు, నా కలల మైదానాల నీతో కలసి నడచిన నదీ సైకత తీరాలు, నిద్రలేని శరద్రాత్రులూ.. నేను వద్దని అంగీకరించని నీ ఉనికివైపు ఏదో శక్తి నన్ను ఎప్పుడూ తరుముతూనే ఉంటుంది. నీ ప్రత్యేకతని ఎందుకూ కావాలని గుర్తించక పోవడం? నువ్వంటూ లేకపోతే అందరూ అర్థమయ్యే వాళ్ళు నాకు. కానీ నువ్వు వస్తావ్. నాకు తెలిసిన విశ్వం అస్తిత్వం కోల్పోతుంది. ఎందుకిలా కావాలి? నువ్వు నిజమెందుకవాలి? నిన్ను పోగొట్టుకొని నేనెందుకు ఓడిపోవాలి? లేక ఇదీ ఒకరకమైన గెలుపా?

ఇంతా చేసి నీమీద కేవలం మోజో లేక ప్రేమో మాత్రమే అనుకునేవ్.. అంతకు మించిన భావమేదో ఉంటుంది. దాని శక్తి సృష్టికి మూల కారణం. అనాచ్ఛాదితమైన, ఏ నటనలూ లేని హృదయాల్లోంచి పుట్టుకొచ్చే కోరిక, ఏదో తెలీని జిజ్ఞాస, మన ఉనికిని అర్థం చేసుకొని, మనం వచ్చిన చోటులోకి తిరిగి కలిసిపోవాలన్న గాఢమైన వాంఛ. ఎలా చెప్పాలో అసలు తెలీదు.. ఇంతటికీ మూల కారణం

నువ్వే ఎందుకో? దానికి సమాధానం గొప్ప గొప్ప కవులకే తెలీదే చలమంతటి వాడే దాన్ని సింపుల్‌గా చార్మని వదిలేస్తాడు.. Carl Jung calls the concept Anima/Animus. మరి సుబ్బారావంటాడు చూడు ఎంకి గురించి 'కళ్ళెత్తితే సాలు కనకాబిసేకాలు', అలాగన్నమాట. ఏమరపాటుగా ఏదో ఆలోచిస్తున్న క్షణం ఆ చూపు చప్పుడు చేయక గుండె లోతుల్లో దూరి అల్లరి పెడుతుంది. వెన్నెల కోనల్లో చల్లని వానలు కురిపిస్తుంది. మిణుగురు కాంతుల తూణీరాల్ని సంధిస్తుంది. కౌగిట్లో కైవల్యాన్ని ప్రసాదిస్తుంది.. అదే ఆ లక్షణమే ప్రాణాలు తీసేది...

చలంలాగా అనుకొంటాను అప్పుడప్పుడూ, ఈ లోకంలో నాకు తప్ప ఎవరికీ గొప్పగా ప్రేమించడం తెలీదేమోనని. ఇదీ మానవ సహజమైన అహంభావం మాత్రమే నంటావా? ఏమో? పక్కన కంప్యూటర్‌లో మధురంగా 'ప్రియే చారుశీలే' పాట వస్తుంది. ఎంత అద్భుతంగా రాశాడంటావ్? జయదేవుడి అష్టపదులంతటి రమణీయమైన శృంగారం మరెక్కడా లేదే? అవునూ, నిజంగా రాధకూ, కృష్ణుడికీ మధ్య అంత అందమైన ప్రేమ సాధ్యమేనంటావా? లేక మనిషి తను ఎప్పటికీ పొందలేని ఆ అనుభవాన్ని అలా ఐడియలైజ్ చేశాడంటావా? మరి రుక్మిణి , సత్యభామల మాటేమిటో? అవున్నా, జీవితంలో ఒక్కే ప్రేమ అసాధ్యం కదా? ఒకసారి మండువేసవిలో మల్లెపూల లాంటి ప్రేమని అనుభవిస్తే, మరోసారి వర్షాకాలపు సాయంత్రం జాజితీవె మీద పడే చిరుజల్లులాంటి ప్రేమ.. మరోటి వెన్నెల మరకల్లో వన్నెల గోదావరి లాంటిది. జీవితంలో ఒకటికంటే ఎక్కువసార్లే పడతాం ప్రేమలో.. కానీ రాధాకృష్ణుల ప్రేమలాంటి ఘట్టం ప్రతి హృదయంలో ఉంటుంది. అదిగో అదే నన్ను మళ్ళీ, మళ్ళీ ఇలా వెనక్కు లాక్కు వచ్చేది. నిజమే ఆ అర్థం కాని, అసంభవమైన ప్రేమే రాధామాధవం. అవునూ, రాధామాధవం పూలు తెలుసా నీకు? చిన్నప్పుడు అమ్మమ్మ వాళ్ళింటి పక్కన ఉండేవి. సునీత, నేను వాటితో దండలల్లే వాళ్ళం పచ్చ గన్నేరు పూలతో కలిపి.. అయినా ఇప్పుడా విషయం ఎందుకు గుర్తు వచ్చిందో? నీతో వచ్చిన సమస్య ఇదే, నీతో మాట్లాడుతుంటే ఎక్కడ మొదలయ్యి, ఎక్కడ అంతమౌతాయో తెలియవు ఆలోచనలు. ఇంతకూ రాధామాధవం పూలు చూడ్డానికి భలే నాజూగ్గా, అందంగా, సన్నని పరిమళంతో ఉంటాయి. అంతటి అద్భుతమైన పూలకు ఆ పేరు పెట్టడం ఎంత తగినట్లుగా ఉంది.

ఎప్పుడైనా చెప్పానా నీకు? మురళీ క్రిష్ణ, వేణుమాధవ్ అన్న పేర్లంటే నాకు చాలా ఇష్టమని? ఒక మురళీ క్రిష్ణ ఓ సారి పరిచయమయ్యాడు . అందంగా పెదిమ క్రిందుగా గడ్డం మీద పుట్టుమచ్చతో సహా బాగుండేవాడు. ఏమైపోయాడో, కాలగర్భంలో కలిసి? అసలెక్కడ పరిచయమో కూడా గుర్తులేనంత అనామకుడన్నమాట. మరింక వేణుమాధవ్ లెక్కడా దొరకలేదు. బోల్డంతమంది మంది వేణులూ, కొందరు మాధవ్‌లే.. ఎందుకో మరి ఆ పేరుకీ, అమరమైన ప్రేమకీ లంకెగా తోస్తుంది.. ఎవరో అన్నారు మొన్నెప్పుడో. ప్రేమలో విరహం అనుభవించే వాళ్ళ బాధ, దేవునికై తపించే భక్తుని వేదనతో పోలిందని.. అందుకే 'గీతాంజలి' అంత మధురమైంది. అంతటి ఉన్నతమైన ప్రేమని అర్థం చేసుకోగల శక్తి ఉంటే ఆ దేవుడికే ఉంటుందేమో. (దేవుడంటే ఇక్కడ మన ఆశలన్నీ కలగలుపుకొని సృష్టించుకొన్న ఒక ఎంటిటీ అనే. అదిగో, నవ్వుకుంటున్నావా, నా నాస్తికత్వం రుజువు చేసుకోవాలన్న తపన గురించి?). అందుకే గోదాదేవి, మీరాల ప్రేమలు అద్భుతాలయ్యాయి మనకు. అంతటి ప్రేమను మరే వ్యక్తిమీదో కేంద్రీకరిస్తే లోకం నవ్విపోయేదేమో? తిరిగి మళ్ళీ అర్థం కాని ఆ ఆవేదనల కొలిమి క్రిందకే వచ్చినట్టున్నాం?

కానీ ఇంతా తెలిసి ఇంకా ఈ విచిత్ర భావనల్లో కొట్టుకు పోయేవాళ్ళుంటావు చూశావూ? వాళ్ళంటే నాకెంత ఇష్టమో తెలుసా? 'తెలిసీ వలచీ, విలపించుటలో..' అంటాడు చూడు ఆత్రేయ.. అలాగన్నమాట. మొన్న 'కి-' తో మాట్లాడుతుంటే ఇలా అన్నాడు. 'అన్నింటికీ లాజిక్ తో ఆలోచించి, స్పందన కోల్పోతే జీవితానికి అర్థమేముంది?' . ఇలా ఆలోచనలు, కారణాలు అన్నీ మానేసి, నేనిలా నీ గురించి ఊహల్లో పడిపోవటం, నీ జ్ఞాపకాలు నా కలానికి మళ్ళీ ఊపిరి పొయ్యటం.. ఇదంతా.. నన్ను మళ్ళీ నేను కనుక్కున్నట్టయింది.. థాంక్స్!

✷✷✷